


**ప్రజా సమస్యల కోసం ఇంటింటికి సిపిఐ పాదయాత్ర: గోదా**

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
శుక్రవారం | 19 డిసెంబరు , 2025 | పేజీలు : 06

# జిల్లా ఆసుపత్రిపై కలెక్టర్ 'సింహస్వప్నం'

### 82 మందికి షోకాజ్ నోటీసులు!

### మూడు గంటల పాటు ఆకస్మిక తనిఖీ.. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే వేటు తప్పదని హెచ్చరిక

**ప్రజాపక్షం/భువనగిరి :** జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో గురువారం కలెక్టర్ హనుమంత రావు ఒక్కసారిగా ఆకస్మికంగా తనిఖీ చేపట్టారు. సుమారు మూడు గంటల పాటు ఆసుపత్రిలోని ప్రతి వార్డును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, విధుల్లో నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై కొరడా ఝుళిపించారు. సరైన సమయపాలన పాటించని 63 మందితో పాటు, విధులకు గైర్హాజరైన మరో 19 మందికి, మొత్తం 82 మందికి తక్షణమే షోకాజ్ నోటీసులుజారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

**రోగులతో ముఖాముఖి.. సేవలపై ఆరా**

తనిఖీలో భాగంగా కలెక్టర్ వార్డు వార్డును కలియతిరిగారు. ఎస్ఎన్‌సియు, పీడియాట్రిక్, డెలివరీ విభాగాలను సందర్శించి అక్కడ అందుతున్న సేవలపై రోగులతో మాట్లాడారు. వైద్యం అందుతుందా? 'డాక్టర్లు సమయానికి వస్తున్నారా? మందులు, టీకాలు సక్రమంగా ఇస్తున్నారా?' అని బాలింతలను, రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న ఆహారం ఎలా ఉంది? మెనూ





పాటిస్తున్నారా? అని ఆరా తీశారు. ఓపి సమయంలో ఎంత మంది వైద్యులు అందుబాటులో ఉంటున్నారో రికార్డులను తనిఖీ చేశారు.

**శానిటేషన్, నిర్మాణాలపై ఆగ్రహం..**

ఆసుపత్రిలో అపరిశుభ్రతపై కలెక్టర్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. శానిటేషన్ సిబ్బంది పనితీరు సరిగ్గా లేదని మందలించారు. అలాగే ఆసుపత్రిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు అసంపూర్తిగా ఉండటంపై సదరు కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడొద్దని, కొత్త భవ న నిర్మాణాన్నియుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

**నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు..**

'ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే పేద రోగులకు మెరుగైన వైద్యం అందాలి. డాక్టర్లు, సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉంటూ బాధ్యతగా పనిచేయాలి. విధుల్లో అలసత్వం వహించే వారిని ఉపేక్షించేది లేదు' అని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, ఆసుపత్రి సూపరింటెండెంట్ , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త సర్పంచ్‌లకు సమస్యల సవాళ్లు

**ప్రజాపక్షం/మోతె :** కొత్తగా సర్పంచ్‌లుగా గెలిచిన మండలంలోని 29 గ్రామాల సర్పంచ్‌లకు గ్రామాలలో నెలకొన్న సమస్యలు సవాల్ విసురుతున్నాయి. ఏ గ్రామంలో చూసినా ఏమున్నది గర్వకారణం అంటూ ఏ వీధులలో చూసినా మురుగు కాల్వలలో పేరుకపోయిన చెత్త ఆ వీధులలో కంపుకొడుతున్నాయి. వీధుల వెంట పిచ్చి మొక్కలు దర్శనమిస్తున్నాయి. గ్రామాలలో సుమారు రెండు సంవత్సరాల నుండి వీధి దీపాలు వెలగకపోవడంతో నేటికి కారుచీకట్లు గ్రామాల్లో ఉన్న పరిస్థితి. ప్రతి ఇంటికి పైపులైన్ల ద్వారా వెళ్ళవల్సిన త్రాగునీరు పైపులు పగిలిపోయి వీధులన్ని బురదమయం కాగా గ్రామ కార్యదర్శులు మాకేం పట్టింది పెట్టిన పైసలు నేటికి తిరిగి రాలేదని మీనమేషాలు లెక్కించారు. గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా సర్పంచ్ అభ్యర్థులు సుమారు రూ.30లక్షల నుండి రూ.50లక్షల వరకు ఖర్చు చేసి గెలిచారు. గ్రామ పంచాయితీ సిబ్బంది పనులు చేస్తున్నప్పటికి నిధుల కొరతతో రోజువారీగా గ్రామంలో చెత్తసేకరణ చేయడానికి ట్రాక్టర్లలో డిజిల్ లేక మూడు రోజులకు ఒకసారి చెత్తసేకరణ జరుగుతుంది. ఇప్పటికే గ్రామాలలో ఉపాధి హామీలో నర్సరీలు ఏర్పాటు చేయగా నర్సరీల నిర్వహణ సక్రమంగా లేక మొక్కలు వాడిపోయి గ్రామాలలో పచ్చదనం కొరవడింది





దని పలువురు చర్చించుకుంటున్నారు. ఈనెల 22న కొత్త సర్పంచ్‌లుగా ప్రమాణ స్వీకరం చేయడమే మొదలు గ్రా మంలో మౌళిక సమస్యలు పూలదండలై స్వాగతం పలకనున్నాయి. ఈ తరుణంలో కొత్తగా గెలుపొందిన సర్పంచ్‌లు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఎలా అమలు చేస్తారో వేచి చూడాలి మరి.

## నరేంద్ర మోదీ ప్రభుత్వానికి సరైన బుద్ధి చెబుతాం

### జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** భారతదేశంలో ప్రజాస్వామ్యాన్ని నరేంద్ర మోడీ ఖూనీ చేస్తున్నరని, కేంద్ర ప్రభుత్వానికి సరైన బుద్ధి చెప్తాం అని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీపై, లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పై నేషనల్ హెరాల్ కేసులో గత పదేళ్లుగా కేంద్రంలో బిజెపి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలపై అక్రమాలపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించి నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బిజెపి కార్యాలయం ముట్టడికి బయలుదేరే సందర్భంలో పోలీసులు అక్రమ అరెస్టులు చేసి యాదగిరిగుట్ట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా యాదాద్రి భువనగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్రం తెచ్చి ప్రాణత్యాగాలు చేసి దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుతున్న గాంధీ కుటుంబాన్ని దోషులుగా చిత్రీకరించడానికి నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వం ఈడి, సిబిఐ, ఈసీని అడ్డుపెట్టుకొని సోనియా గాంధీని, రాహుల్ గాంధీని నేషనల్ హెరాల్ కేసులో చార్జి షీట్ వేయడాన్ని చాలా దురదృష్టకరం అన్నారు. ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్, బర్రె జహంగీర్, తంగేళ్లపల్లి రవికుమార్, పోతంశెట్టి వెంకటేశ్వర్లు, కూర వెంకటేష్ పడిగెల ప్రదీప్ ఈరపాక నరసింహ, దర్గాయి హరిప్రసాద్, పిట్టల బాలరాజ్, శివకుమార్, రాచమల్ల రమేష్, మంచికంటి కృష్ణమూర్తి, బీస్కుంట్ల సత్యనారాయణ, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.





## నేడు పలు మండలాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ పట్టణం లోని 220కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు జరుగుతున్నందున మిర్యాలగూడ వన్ టౌన్, టు టౌన్, మిర్యాలగూడ రూరల్, త్రిపురారం, వేములపల్లి మండలాలకు సంబంధించిన 33 కేవీ, 11కేవీ సబ్‌స్టేషన్లకు శుక్రవారం ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 4గంటల వరకు విద్యుత్ ఉండదని మిర్యాలగూడ విద్యుత్ డివిజన్ ఇంజనీర్ శ్రీనివాసచారి అన్నారు. గురువారం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సందర్భాన్ని బట్టి మాడ్గులపల్లి 132కేవీ సబ్‌స్టేషన్ నంచి అవసరాన్ని బట్టి బ్యాక్ ఫీడింగ్ సప్లయ్ తీసుకోవడం జరుగుతుందన్నారు. విదుయత్ అంతరాయం ఉన్నందున వినియోగదారులు విద్యుత్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని కోరారు. సమావేశంలో ఏడీఈలు కోడిరెక్క రవికుమార్, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## ఐదు గ్రామాలకు ఉపసర్పంచ్ ఎన్నిక



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని ఐదు గ్రామాలకు ఉపసర్పంచ్‌లను గురువారం ఆర్‌వోల సమక్షంలో ఎన్నిక ప్రక్రియ నిర్వహించి వారికి నియామకపత్రాలు అందించడం జరిగిందని ఎంపీడీవో శేషగిరిశర్మ తెలిపారు. వెంకటాద్రిపాలెం దాసరాజు అంజయ్య, అవంతీపురం ఉప్పుతల మహేష్, ముల్కలకాల్వ షేక్ జానీపాషా, రాయినిపాలెం చిలుకల సతీష్, సీత్యాతండా ధనావత్ మంగ్యాలు ఉపసర్పంచ్‌లుగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో ఎంపీవో రమేష్, మాస్టర్ శిక్షకులు గుడిపాటి కోటయ్య, ఆర్‌వోలు బొలిశెట్టి భిక్షపతి, గోపయ్య, ధర్మనాయక్, వీరయ్య,రాజు, కృష్ణకాంత్, చంద్రయ్య, ఉస్మాన్, కురువానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చిన సర్పంచ్

**ప్రజాపక్షం/అర్వపల్లి :** సర్పంచ్‌గా తనను గెలిపిస్తే గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చి గెలుపొందిన తరువాత ఇచ్చిన హామీని నెరవేర్చడం జరిగింది. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.



అర్వపల్లి మండలంలోని రామన్నగూడెం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికైన కర్నాటి వెంకన్న గ్రామంలో ఎంతో కాలంగా నీటి సమస్యతో ఇబ్బందిపడుతున్న ప్రజల సమస్య పరిష్కరించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దీనిలో భాగంగా గత కొంత కాలంగా గ్రామంలో ఉన్న బావిలో పేరుకపోయిన చెత్తాచెదారంతోపాటు మురుగునీరు కూడా బావిలోకి ప్రవేశించడంతో దానిని ఆయన గురువారం శుభ్రం చేయించారు. ఇచ్చిన మాటను నిలుపుకున్న ఆయనను ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

# మట్టపల్లి దేవస్థాన అనువంశిక పాలకమండలి వేధింపులు

### అర్యవైశ్య సత్రం కొనసాగాలంటే అడిగినంత ఇవ్వాలని డిమాండ్

### ఇష్టదైవాలకు పూజలు చేయకుండా అడ్డుకుంటున్న వైనం

### సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరుతున్న నిర్వాహకులు



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** నియోజకవర్గంలో మట్టపల్లిలో గల స్వయంభుగా వెలసిన శ్రీలక్ష్మి నర్సింహ స్వామి ఆలయ అనువంశీక చైర్మన్ సోదరులు 1951 నుండి అన్నదానం నిర్వహిస్తున్న అర్యవైశ్య సత్రంకు సంబంధించిన నిర్వాహకులను వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాశెట్టి వెంకటేశ్వర్లు, గెల్లి విద్యాసాగర్‌రావులు అన్నారు. గురువారం హుజూర్‌నగర్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ బిల్డింగ్ హాల్‌లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సత్రంలోని వాసవి అమ్మవారికి పూజలు నిర్వహించాలంటే రూ. పది లక్షల నగదు ఇవ్వాలని, సత్రం నిర్వాహణకు సంబంధించిన ఆర్థిక అంశాలన్ని తమకు తెలియజేయాలని డిమాండ్ చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులను కలిసి విన్నవించగా సత్రాలలో తమ ఇష్టదైవాలకు పూజలు చేసుకోవచ్చని ఆలయ ఈవోకు తెలిపారని అన్నారు. ఈ విషయాన్ని పాలకమండలి చైర్మన్‌ను తెలిపిన నాటి నుండి ఆర్యవైశ్య సత్ర నిర్వాహకులను లక్ష్యంగా చేసుకుని వేధింపులకు గురి చేస్తున్నారని అన్నారు. పూజారులను చేయనీయకుండా తాము పూజారులను నియమించుకుంటే బూటకపు వ్యక్తులతో లేనిపోని విమర్శలు చేస్తూ ఆర్యవైశ్య సత్ర నిర్వాహకులను మానసికర వేధనకు గురి చేస్తున్నారని అన్నారు. ఆర్యవైశ్య సత్రంపై చేసిన బూటకపు ఆరోపణలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్న సత్రనిర్వాహకులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే చట్ట ప్రకారం ముందుకెళ్తామని హెచ్చరించారు. ఆలయ నిర్వాహణకు, సత్రాల నిర్వాహణకు సంబంధించిన విషయాలపై సమగ్రంగా విచారణ జరిపి అనువంశీక సోదరుల ఆగడాలపై విచారణ జరిపి, సత్రంనిర్వాహణకు సంబంధించిన స్వేచ్ఛను తమకు కల్పించాలని అధికారులను కోరినట్లు తెలిపారు. భవిష్యత్‌లో దైవకార్యాలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు ఆలయ అనువంశీక చైర్మన్ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వ పెద్దలకు, అధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం సత్ర నిర్వాహకులు, నాయకులు వెంపటి మధు, కన్నెగండ్ల రంగయ్య, ఓరుగంటి నర్సింహరావు, చల్లా ప్రకాశ్‌రావు, వంగవీటి వేణు, వెంపటి వెంకటేశ్వర్లు, కుక్కడపు రామ్మోహన్‌రావు, పొలిశెట్టి లక్ష్మి నర్సింహరావు, పేరూరి అశోక్, గుండా శ్రీనివాసరావు, దాస నాగేశ్వరరావు, బచ్చు, ఓరుగంటి మట్టయ్య, పొలిశెట్టి ఎల్లయ్య, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఆశా వర్కర్‌ల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఆశా వర్కర్‌ల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని బిఆర్‌టియు రాష్ట్ర ఉపాధ్యక్షుడు, శ్రమ శక్తి అవార్డు గ్రహీత సిలివేరు ప్రభాకర్ డిమాండ్ చేశారు. గురువారం నల్లగొండలో డిఎంహెచ్‌ఓ పుట్ల శ్రీనివాస్‌ను కలసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ లెప్రసి పెండింగ్ బిల్లుల విడుదల గురించి,పెండింగ్ యూనిఫాం ల విడుదల గురించి,జాబ్ చార్ట్ ప్రకారం పనులు చేయించాలన్నారు.ఈ సందర్భంగా డిఎంహెచ్‌ఓ సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆశాల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు, జిల్లా అధ్యక్షురాలు సింగం రేణుక,వి. సుజాత, జ్యోతి,ప్రమీల,సావిత్ర, పద్మ,లలిత,నీలావతి, శోభారాణి, శ్రీలత,దనమ్మ,స్వప్న పాల్గొన్నారు.

## ఇండ్ల పట్టాల కోసం ఎమ్మెల్యేకు వినతి

**ప్రజాపక్షం/చిట్యాల:** నల్లగొండ జిల్లా చిట్యాల మండంలంలో పనిచేస్తున్న జర్నలిస్టులందరికి ఇండ్ల స్థలాలు అందేలా చూడాలని నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశంను టియుడబ్ల్యూజె నాయకులు గురువారం వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు ఏళ్ళ బయ్యన్న మాట్లాడుతూ అనేక అనేక సంవత్సరాలుగా పాలకులు జర్నలిస్టుల ఇండ్ల స్థలాల విషయంలో హామీలు ఇస్తున్నారే కాని అమలులోకి రావడం లేదని, శాసనసభ్యులు తమ సమస్యను పరిగణలోకి తీసుకుని పరిష్కరించాలని కోరారు. ఇందుకు వీరేశం సానుకూలంగా స్పందించారు. వినతి పత్రాన్ని సమర్పించిన వారిలో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మెండె వెంకన్న, పోకల కరుణాకర్, కోశాధికారి చెరుపల్లి శ్రీనివాసులు, నాయకులు ఏళ్ళ వెంకన్న తదితరులున్నారు.



**బయ్యన్నకు అభినందనలు:** లంబాడీల జీవనశైలిపై ఛాయా చిత్రాలు తీసి జాతీయ స్థాయి అవార్డు పొందిన పాత్రికేయులు ఏళ్ళ బయ్యన్నను ఎంఎల్ఏ వీరేశం ఈ సందర్భంగా అభినందించారు. లంబాడీల సంస్కృతి ప్రతిబింబించేలా ఫోటోలు తీయడం అభినందనీయమని, భారతీయ సంస్కృతిని వెలికి తీసి భవిష్యత్తు తరాలకు అందించేలా బయ్యన్న కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు.

## శాంతిగూడెం సర్పంచ్‌గా భాస్కర్‌రెడ్డి

**ప్రజాపక్షం/డిండి;** డిండి మండలం శాంతిగూడెం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి బుధవారం ప్రకటించిన ఫలితాల్లో గెలుపొందారు. ఈసందర్భంగా భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేశామని, ప్రభుత్వం ఎంఎల్ఏ బాలునాయక్ సహకారంతో మరింతగా అభివృద్ధి చేస్తానని అన్నారు. గెలుపుకు కృషి చేసిన ప్రజానికానికి ధన్యవాదాలు తెలిపారు.



## పార్లమెంట్‌లో కాంగ్రెస్ ప్రైవేట్ బిసి బిల్లు పెట్టాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పార్లమెంట్‌లో కాంగ్రెస్ పార్టీ ప్రైవేట్ బీసీ బిల్లు పెట్టాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. గురువారం ఆయన హైదరాబాద్‌లో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి విజ్ఞప్తి చేసి మాట్లాడారు. వంద మంది ఎంపీలు ఉన్న కాంగ్రెస్ తరుపున ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధి ఏనాడూ బీసీల కోసం పార్లమెంట్‌లో మాట్లాడలేదని, కొట్లాడలేదని అన్నారు. ఓట్ చోరీ లాంటి అంశాన్ని లేవనెత్తి రోజుల తరబడి పార్లమెంట్‌ను స్తంభింపచేసిన ఆయన ఏ ఒక్కనాడు కూడా బీసీ కోటా గురించి ఎందుకు మాట్లాడలేదన్నారు. బీసీలంటే అంత చిన్నచూపు ఎందుకని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి సైతం జంతర్‌మంతర్ వద్ద ధర్నా, అసెంబ్లీలో తీర్మాణం, ఆర్డినెన్స్‌ల పేరిట నాటకాలతో కాలయాపన చేశారే తప్పా బీసీ రిజర్వేషన్లపై చేసిందేమి లేదన్నారు. గ్లోబల్ సమ్మిట్ పేరుతో ప్రధానమంత్రి నరేంద్రమోడిని కలవడానికి సమయం ఉంటుంది కాని బీసీల కోటాపై ప్రధానమంత్రి దృష్టికి ఎందుకు తీసుకెళ్లలేదని అన్నారు. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని బీజేపీ పట్టించుకోవడం లేదని విమర్శించారు.

## అనర్హత పిటిషన్ల రద్దు రాజ్యాంగ విరుద్ధం

**ప్రజాపక్షం/తుంగతుర్తి :** బిఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన పది మంది ఎమ్మెల్యేలో కాంగ్రెస్ పార్టీలో చేరగా సుప్రీం కోర్టులో దాఖలైన పిటిషన్, కోర్టు ఆదేశాలతో విచారణ చేసి వారిపై చర్యలు తీసుకోవల్సిన శాసనసభా స్పీకర్ రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ అనర్హత పిటిషన్‌ను రద్దు చేయడం సరైనది కాదని బిఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షులు తాటికొండ సీతయ్య అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ విషయంలో స్పీకర్ వెంటనే నిర్ణయం తీసుకోవాలని అత్యున్నత న్యాయస్థానం ఆదేశాలు ఇచ్చినప్పటికి సిఎం సూచనల మేరకు పిటిషన్లను రద్దు చేయడం అప్రజాస్వామికమన్నారు. ఇది రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కినట్లేనని విమర్శించారు. ఇంతటితో ఈ అంశం ముగియదని పార్టీ మారిన పది మంది శాసనసభ్యుల పదవీ రద్దు అయ్యేలా బిఆర్‌ఎస్ న్యాయ పోరాటం చేస్తుందన్నారు.

## చింతలపాలెంలోని గ్రామ పంచాయతీల సర్పంచ్‌లు వీరే

**ప్రజాపక్షం/చింతలపాలెం :** చింతలపాలెం మండలంలోని గ్రామ పంచాయితీలకు బుధవారం జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన అభ్యర్థులు ఇలా ఉన్నారు. అడ్లూరు జెట్టి నాగిరెడ్డి (కాంగ్రెస్), చింతలపాలెం కందుల రామకోటిరెడ్డి (బిఆర్‌ఎస్), చింత్రియాల సకినాల తిరుపతిరావు (కాంగ్రెస్), దొండపాడు చెన్నకేశి వెంకయ్య (కాంగ్రెస్), గాంధీనగర్ తండ బానోత్ పురిబాయి (కాంగ్రెస్), గుడిమల్కాపురం పోల్నెడినరసమ్మ శ్రీనివాసరావు (బిఆర్‌ఎస్), కిష్టాపురం షేక్ అమీరున్‌బీ (కాంగ్రెస్), కొత్తగూడెం మాలవత్ శారద (కాంగ్రెస్), నక్కగూడెం గుగులోతు శ్రీను (కాంగ్రెస్), పీక్లానాయక్ తండ లకావత్ సైదులు (కాంగ్రెస్), పులిచింతల ప్రాజెక్టు కాలనీ కొల్ల భూలక్ష్మి (కాంగ్రెస్), రెబల్లె ఐలపంగు మాధవి (కాంగ్రెస్), తమ్మారం కర్ణం హనుమయ్య (కాంగ్రెస్), వజినేపల్లి కొండపల్లి సుందరరావు (కాంగ్రెస్), యర్రకుంట తండ భూక్య రవి (బిఆర్‌ఎస్), శోభనాద్రిగూడెం అమేర విజయలక్ష్మి (కాంగ్రెస్ ఏకగ్రీవం).

## ధనుర్మాస ఉత్సవాలు

**ప్రజాపక్షం/అర్వపల్లి :** జాజిరెడ్డిగూడెం శ్రీయోగానంద లక్ష్మి నృసింహ స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. గురువారం మూడవ రోజు తిరుప్పావై పారాయణ మూడవ పారాస పారాయణం, విశేష ఆరాధన, విష్ణుసహస్రనామ పారాయణంతో భజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బింగి కృష్ణమూర్తి రజిత, కీర్తి వెంకటేశ్వర్లు విజయ, బొల్లం సైదులు, తాటికొండ జనార్ధన్, పెద్ది నారాయణ, సదాలక్ష్మి పాల్గొన్నారు.





## ఎర్రగుంటపల్లి సర్పంచ్ విష్ణువర్ధన్‌రెడికి అభినందన

ప్రజాపక్షం/డిండి; డిండి మండలం ఎర్రగుంటపల్లి గ్రామ సర్పంచ్‌గా విజయం సాధించిన మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డిని గురువారం అభినందించి, శాలువాలతో సత్కరించిన బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు, దేవరకొండ మాజీ ఎంఎల్‌ఎ రమావత్ రవీంద్రకుమార్. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎర్రగుంటపల్లి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేయడం జరిగిందని ప్రజలు అభివృద్ధి చేసే నాయకుడికే పట్టం కట్టారని, గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయాలని విష్ణువర్ధన్‌రెడ్డిని అభినందించారు.

## వావిల్‌కోల్ సర్పంచ్‌గా పేర్వాల రజిత జంగారెడ్డి



ప్రజాపక్షం/డిండి; డిండి మండలం వావిల్‌కోల్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పేర్వాల రజిత జంగారెడ్డి గెలుపొందారు. బుధవారం మధ్యాహ్నం నిర్వహించిన ఎన్నికల ఫలితాల్లో ప్రత్యర్థి ముంగి స్వప్న మాధవరెడ్డిపై 727 ఓట్ల మెజార్టీతో రజిత జంగారెడ్డి విజయదుందుభి మోగించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ విజయం వావిల్‌కోల్, వడ్డెర గూడెం, రుద్రాయి గూడెం గ్రామప్రజలదని వావిల్‌కోల్ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా అత్యధిక మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

## ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు

ప్రజాపక్షం/గుండాల; యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల మరిపడిగ గ్రామ సర్పంచ్‌గా గెలిపించిన ఆశీర్వదించిన గ్రామ ప్రజలకు ప్రతి ఒక్కరికి పేరుపేరున కృతజ్ఞతలు తెలిపిన సర్పంచ్ గూడెపు కుమార్. ఈసందర్భంగా గురువారం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు మరిపడిగ గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ఉత్తమ గ్రామపంచాయతీగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ, మంచినీటి, పారిశుద్ధ్య, వీధి దీపాల కల్పనకు ముందుగా చర్యలు చేపడతానని, గ్రామంలో సిసి రోడ్లు, లింక్ రోడ్లను పూర్తి చేసి గ్రామాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకువెళతానని ఆయన తెలిపారు.

## కొల్‌ముంతల్‌పహాడ్ సర్పంచ్‌గా సరస్వతి రవినాయక్

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; బుధవారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మండల పరిధిలోని కొల్ ముంతల్‌పహాడ్ సర్పంచ్‌గా గతంలో సర్పంచ్‌గా పనిచేసిన అభ్యర్థే మరోసారి రమావత్ సరస్వతి రవినాయక్ 8 ఓట్ల మెజార్టీతో గెలుపొందాడు. గురువారం సర్పంచ్ సరస్వతి రవినాయక్ ఎంఎల్‌ఎ బాలునాయక్‌ను కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.



# ఉపసర్పంచ్ ఎన్నికపై ఉత్కంఠ వీడనుందా?



ప్రజాపక్షం/నార్కట్ పల్లి : స్థానిక సంస్థ ఎన్నికల్లో మొదటి విడతలో భాగంగా ఈ నెల 11 న జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల పర్వం నార్కట్ పల్లి మండలంలో ప్రశాంతంగా ముగిసింది. కాగా మండలంలోని 29 గ్రామ పంచాయతీలలో 2 గ్రామ పంచాయతీ లు ఏకగ్రీవం కావడంతో 27 గ్రామ పంచాయతీ లకు ఎన్నికల అధికారి,ఎంపీడీఓ ఉమేష్ కుమార్ ఆధ్వర్యంలో విజయవంతం గా నిర్వహించు కున్నారు. ఎన్నికలు నిర్వహించడం ఒక పర్వం ఐతే విజయం సాధించిన వార్డ్ సభ్యుల నుండి ఉపసర్పంచ్ ఎన్నికను 2 గ్రామ పంచాయతీ లలో మినహా అన్ని గ్రామాలలో ఎన్నుకోవడం జరిగింది. నార్కట్ పల్లి మేజర్ గ్రామ పంచాయతీ,మండ్ర గ్రామలలో ఉప సర్పంచ్‌ల ఎన్నిక పై సభ్యుల మధ్య సఖ్యత కుదరక బలా బలాలు తేల్చుకునేలా పోటా పోటీ నెలకొనడంతో నేటి వరకు ఉత్కంఠ నెలకొంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 22న ప్రజలు ఎన్నుకోబడిన సర్పంచ్‌లు, వార్డ్ సభ్యుల ప్రమాణ స్వీకారం ఉన్నందున 19వ తారీఖు వరకు ఉపసర్పంచ్‌ల ఎన్నిక కూడా పూర్తి స్థాయిలో నిర్వహించాలని ఆదేశాలతో మండలంలోని రెండు గ్రామాలలో ఉపసర్పంచ్‌ల ఎన్నికపై నెలకొన్న ఉత్కంఠ వీడనుందా తరహాలో ప్రజలు ఎదురుచూస్తున్నారు.

## జెడ్‌పిటిసి, ఎంపిటిసి ఎన్నికల పోటీకి సిద్ధం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : రాబోయే జెడ్పిటిసి,ఎంపిటిసి ఎన్నికల్లో పోటీ చేసేందుకు బిఎస్‌పి అభ్యర్థులు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు రావులపాటి రవి శంకర్ వెల్లడించారు.గురువారం పట్టణంలోని మనోరమ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రం శేఖర్ ఆదేశానుసారం ఉమ్మడి నల్లగొండ జిల్లా ఇన్చార్జ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల సమన్వయ కర్త మంచాల శ్రీకాంత్ సూచనల మేరకు జిల్లాలోని అన్ని మండలాల్లో పోటీ చేయడం జరుగుతుందని తెలిపారు.స్థానిక సర్పంచ్ ఎన్నికలో రాష్ట్ర,జిల్లా నాయకత్వానికి సమాచారం లేకుండా వివిధ పార్టీలతో లోకల్ బాడీ ఎన్నికలలో పోటీ చేస్తూ అలాగే పని చేస్తున్నందుకు గాను పార్టీ క్రమశిక్షణ చర్యల కింద ఎర్ర యాదయ్య,నల్ల రాజేష్,పెరుపాక శ్రావణ్ కుమార్,ఐతరాజు సరళ చెంద్రాయ,పులకరం నరేష్,అయిత అభయంద్రర్,గద్దపాటి రమేష్ లను పార్టీ పదవి నుండి సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు.ఈ సమావేశంలో జోనల్ ఇంచార్జ్ బొడ్డు కిరణ్,జిల్లా ప్రధాన కార్యదర్శి పెరుపాక లింగ స్వామి,వట్టపాక యాదయ్య,లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## మెరుగైన విద్య అందుబాటులో ఉండాలి



ప్రజాపక్షం/వేములపల్లి: మండలంలోని మొల్క పట్నం ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు నామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి కుమార్తె లావణ్య వినయ్ కార్తీక్ రెడ్డి ల వివాహ వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థులకు 35 వేల రూపాయల విలువైన దుస్తులు బూట్లు బెల్టులు మండల విద్యాధికారి లక్ష్మణ్ నాయక్,నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన విద్య అందుబాటులో ఉండాలని విద్యార్థులకు భోజన వసతితో పాటు ఉచితంగా పుస్తకాలు దుస్తులు అందిస్తున్నామని ఈ అవకాశాన్ని విద్యార్థులు వారి తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు మాలి సైదులు,డి శ్రీనివాస్, నామిరెడ్డి నరేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## శ్రీచైతన్యలో హ్యాపీక్లబ్ వేడుకలు



ప్రజాపక్షం/ మిర్యాలగూడ: పట్టణంలోని కృష్ణమానస కాలనీలోగల శ్రీచైతన్య పాఠశాలలో హ్యాపీక్లబ్ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు పాఠశాలకు చెందిన విద్యార్థుల తల్లిదండ్రులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులకు ఆటలు నిర్వహించగా గెలుపొందిన వారికి బహుమతులను పాఠశాల ప్రిన్సిపాల్ ఎం.ఉపేందర్ అందచేసి మాట్లాడారు. విద్యార్థుల అభివృద్ధిలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సరైన సమన్వయ చాలా ముఖ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీచైతన్య విద్యా సంస్థల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, ఏజీఎం సుజిత, అకడమిక్ కోఆర్డినేటర్ వెంకట్, ఈన్ సోమయ్య, సి ఇన్‌చార్జి గౌతమ్, ఇన్‌చార్జిలు కవిత, కరుణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## సర్పంచ్ యుగేందర్‌రెడ్డికి అభినందన

ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; కొండమల్లేపల్లి మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా పసునూరి యుగేందర్‌రెడ్డి భారీ మేజార్టీతో గెలుపొందాడు. గురువారం పసునూరి యుగేందర్‌రెడ్డి మర్యాద పూర్వకంగా దేవరకొండలో ఎంఎల్‌ఎ నేనావత్ బాలునాయక్‌ను కలిశాలు. మాజీ ఎంపిపి దూదిపాల రేఖ శ్రీధర్‌రెడ్డి మద్దతుతో అఖండ విజయం సాధించడంతో ఎంఎల్‌ఎ ఆయనను అభినందించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ ప్రజలు సంపూర్ణ మద్దతు ఇవ్వడంతో గెలిచినందున ప్రజల మధ్య నిరంతరం ఉంటూ, గ్రామ అభివృద్ధికి నిరంతరం తొడ్పడాలని అన్నారు. ఈ విజయంతో రాజకీయంలో ముందుకు వెళ్ళాలని సూచించారు.

## సర్పంచ్ ఎన్నికపై కలెక్టరేట్‌లో ఫిర్యాదు



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; దేవరకొండ మండల పరిధిలోని శేరిపల్లి గ్రామ సర్పంచ్ ఎన్నికల్లో తమకు అన్యాయం జరిగిందని పోటీ చేసిన సర్పంచ్ అభ్యర్థి సునిత రమావత్ గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మొత్తం వార్డుల ఓట్లు 990 పోల్ అయినవని, సర్పంచ్ ఓట్లు 992 పోల్ అయినవని ఎన్నికల అధికారులు తమను కౌంటింగ్ సమయంలో తికమకకు గురిచేసి 2 ఓట్ల తేడాతో ఓటమి చెందినట్లు నిర్ణయించారని అన్నారు. సర్పంచ్ ఎన్నికపై కౌంటింగ్ విషయంలో అనుమానం ఉందని, వార్డు ఓట్లకు, సర్పంచ్ ఓట్లకు ట్యాలీ కాలేదని తిరిగి మరల ఫారం26, ఫారం27, ఫారం28, రిజెక్టెడ్ పోల్ ఓట్ల సిరియల్ నెంబర్లను పరిశీలించి కలెక్టర్ తమకు తగిన న్యాయం చేయాలని కోరుతున్నామని అన్నారు.

## తులసీరాంకు అభినందన



ప్రజాపక్షం/కొండమల్లేపల్లి; కొండమల్లేపల్లి మండల పరిధిలోని చెన్నారం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా గతంలో ఉప సర్పంచ్‌గా పనిచేసిన రమావత్ తులసిరాంనాయక్ బుధవారం జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా గెలుపొందారు. గురువారం తులసిరాంనాయక్ మర్యాద పూర్వకంగా దేవరకొండలో మాజీ ఎంఎల్‌ఎ రమావత్ రవీంద్రకుమార్‌ను కలిశారు. సర్పంచ్‌గా గెలిచినందుకు రమావత్ రవీంద్రకుమార్ తులసిరాంను అభినందించి శాలువాతో సన్మానించారు. అధికారం లేకపోయిన నిరంతరం ప్రజల్లో ఉండి వారి సమస్యలను పరిష్కరించి సర్పంచ్‌గా మంచి పేరు తెచ్చుకోవాలని తులసిరాంనాయక్‌కు ఆయన సూచించారు.

## బిజెపి కార్యాలయం వద్ద ఉద్రిక్తత



ప్రజాపక్షం/నలగొండ టౌన్ : కాంగ్రెస్ పార్టీ నాయకులు బిజెపి కార్యాలయాన్ని ముట్టడిస్తామని పిలుపునివ్వడంతో గురువారం నల్లగొండ పట్టణంలోని ముట్టడించేందుకు వస్తున్న కాంగ్రెస్ నాయకులను అడ్డుకునేందుకు బిజెపి నాయకులు కార్యకర్తలు కార్యాలయం వద్దకు పెద్ద ఎత్తున తరలి వచ్చిన క్రమంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పోలీసులకు బిజెపి నాయకుల మధ్య తోపులాట జరిగింది. బిజెపి కార్యాలయం వద్ద కార్యకర్తలను చూసి కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. బిజెపి కార్యాలయం ముట్టడికి వస్తే ఎక్కడికి అక్కడ అడ్డుకుంటామని బిజెపి నాయకులుహెచ్చరించారు. బిజెపి జాతీ య కిసాన్ మోర్చా నాయకులు గోలి మసుదన్ రెడ్డి,రాష్ట్ర నాయకులు వీరెల్లి చంద్రశేఖర్,జిల్లా ప్రధాన కార్యదర్శులు లింగస్వామి ఉన్నారు.



## లీగల్ ఎయిడ్ క్లీనిక్ ప్రారంభం

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఐదవ జిల్లా అడిషనల్, సెషన్స్ జడ్జి కేవీ.చంద్రశేఖర్, ఎక్స్ అఫిషియో ఛైర్మన మిర్యాలగూడ మండల లీగల్ సర్వీసెస్ కమటీ వారు లీగల్ ఎయిడ్ క్లీనిక్‌ను ప్రారంభించారు. ఇందులో సీనియర్ సిటిజన్స్‌కు న్యాయ సహాయం అందచేస్తారు. కార్యక్రమంలో కొంక వెంకన్న, మేక కుమార్‌రెడ్డి, ప్యానల్ అడ్వకేట్లు దైద సైదులు, ప్యానల్ లీగల్ వాలంటీర్, డీఏవో, సబ్ కలెక్టర్ కార్యాలయ, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## తీర్మలాపురం చెరువులో వదిలిన చేపపిల్లలు



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** ప్రజాప్రభుత్వం ముదిరాజ్ సంఘ సభ్యులకు పంపిణీ చేసిన చేప పిల్లలను గురువారం తుర్కపల్లి మండలంలోని తిర్మలాపూర్ గ్రామ ఊర చెరువులో వదలడం జరిగిందని సర్పంచ్ దొనికెన రేణుక వెంకటేష్ యాదవ్ తెలిపారు. ప్రజా ప్రభుత్వం ముదిరాజులకు చేపపిల్లలు పంపిణీ చేసి వారి కుటుంబాలకు అండగా ఉండడం గొప్పవిషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ నూకల శ్రీనివాస్ యాదవ్, వార్డు సభ్యులు చాడ కర్ణాకర్ రెడ్డి, నాయకులు ఐనాల మహేందర్ రెడ్డి, పాలక వర్గం గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సర్పంచ్‌లకు టిడిపి నాయకుల సన్మానం

**ప్రజాపక్షం/ రామన్నపేట:** మండలంలో నూతనంగా ఎన్నికైన పలు గ్రామాల సర్పంచ్‌లను టీడీపీ ఆధ్వర్యంలో నాయకులు సన్మానించారు. గురువారం మండలంలోని కొమ్మాయిగూడెం గ్రామ సర్పంచ్ మల్లారెడ్డిని, నీర్నెముల గ్రామ సర్పంచ్ గోపాల్‌రెడ్డిని, మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేష్‌ను, పల్లివాడ గ్రామ సర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్‌ను వాళ్ల ఇంటి దగ్గరికి వెల్లి మీకు వచ్చిన బాధ్యత చాలా బలమైందన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ ఇన్‌చార్జి ఎండి.ఫజల్‌బేగ్, నాయకులు బత్తుల సత్తయ్య, నకిరేకంటి గణేష్, దండిగల రాములు, పోచబోయిన మల్లేశం, శ్రీశైలం, విజేందర్‌లు పాల్గొన్నారు.







# సర్పంచ్ సీతారాజును అభినందించిన కెటిఆర్



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో ఇటీవల జరిగిన మొదటివిడత స్థానిక సంస్థల ఎన్నికల్లో మాదాపూర్ గ్రామంలో బిఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీలో నిలిచి, తెలంగాణ రాజ్యాధికార పార్టీ(టీఆర్‌పి)అభ్యర్థిపై 96 ఓట్ల మెజార్టీతో గెలుపొందిన సీతారాజు యాదవ్‌ను బిఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశంసించి, అభినందన తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలో నిర్వహించిన బిఆర్‌ఎస్ అవ్యర్థుల విజయోత్సవ సభకు విచ్చేసిన ఆయన నూతనంగా ఎన్నికైన అభ్యర్థులకు శుభాకాంక్షలు తెలిపి శాలువాలు, మెమెంటోలతో సత్కరరించారు. ప్రజల్లో బిఆర్‌ఎస్‌కు మరింత అభిమానం పెరుగుతుందని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మాదాపూర్ సర్పంచ్ సీతారాజు యాదవ్ మాట్లాడుతూ తన గెలుపు ప్రజల గెలుపు అని, ఆలేరు మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతా మహేందర్ రెడ్డిలకు, అనునిత్యం తనకు వెన్నుదన్నుగా నిలిచి, తన గెలుపుకు గేమ్ చెంజర్‌ల విజయాన్ని వరించేలా చేసిన మండల బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ గట్టు తేజస్వి నిఖిల్‌కు, బిఆర్‌ఎస్ నాయకులను, పార్టీలకతీతంగా సహకరించిన గ్రామ ప్రజలకు, యువకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# గరిడేపల్లి మండలంలో సర్పంచ్‌లుగా విజయం సాధించిన అభ్యర్థులు వీరే

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండలంలో 33 గ్రామ పంచాయతీలలో 8 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 25 గ్రామ పంచాయతీలకు గురువారం ఎన్నికలు జరగ్గా కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులు మెజార్టీ స్థానాలను కైవసం చేసుకున్నారు. బిఆర్‌ఎస్ పార్టీ బలపర్చిన నలుగురు అభ్యర్థులు సర్పంచులుగా ఎన్నికయ్యారు. మిత్ర పక్షాలు బలపర్చిన ఇద్దరు అభ్యర్థులు విజయం సాధించారు. సర్వారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ రెబల్ అభ్యర్థిగా నిలిచిన వ్యక్తి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. మండల కేంద్రమైన గరిడేపల్లి సర్పంచ్‌గా మేకపోతుల వెంకటమ్మ, అప్పన్నపేట గ్రామ సర్పంచ్‌గా నందిపాటి కవిత, పొనుగోడులో కటికం వేణు, ఎల్బీనగర్ సర్పంచ్‌గా బోద సైదిరెడ్డి, తాళ్లమల్కాపురం సర్పంచ్‌గా కుర్రి మహేష్, వెలిదండ సర్పంచ్‌గా చెనగాని సాంబయ్య, కొనాయిగూడెం సర్పంచ్‌గా సకినాల సైదమ్మ, గానుగబండ సర్పంచ్‌గా కడియాల పద్మ, కీతావారిగూడెం సర్పంచ్‌గా నర్సింహరావు, గడ్డిపల్లి సర్పంచ్‌గా మాశెట్టి నాగలక్ష్మి శ్రీహరి, కల్మల్‌చెర్వు సర్పంచ్‌గా బచ్చలకూరి శ్రీను, గారకుంట తండా సర్పంచ్‌గా అరుణ రమేష్, చిన్నగారకుంట తండా సర్పంచ్ మాలోతు సుధాకర్, పరెడ్డిగూడెం సర్పంచ్‌గా కేతేపల్లి నర్సయ్య, కొండాయిగూడెం సర్పంచ్‌గా కోటిరెడ్డి, రామచంద్రాపురం సర్పంచ్‌గా బొలిశెట్టి లక్ష్మమ్మ, కుతుబ్‌షాపురం సర్పంచ్‌గా ఆకుల కృష్ణ, రంగాపురం సర్పంచ్‌గా కట్టా కళ్యాణి, సర్వారం సర్పంచ్‌గా చింతకాయల వినోద, కట్టవారిగూడెం సర్పంచ్‌గా కీత వెంకటేశ్వర్లు, శీత్లాతండా సర్పంచ్‌గా గుగులోతు బుజ్జి, కొత్తగూడెం సర్పంచ్‌గా నకిరేకంటి సుధా నాగరాజు, రేగులగడ్డ తండా బాణోతు సరోజ నాగేశ్వరరావు లు సర్పంచ్‌లుగా విజయం సాధించారు.

# గ్రామీణ ప్రాంతాల్లో బిజెపికి పెరిగిన బలం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రామచంద్రరావు



**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :** గ్రామీణ ప్రాంతాల్లో బిజెపికి బలం పెరిగిందని రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు అన్నారు. భారతీయ జనతా పార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ అధ్యక్షతన పంచాయతీ ఎన్నికలలో గెలుపొందిన వారికి రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు చేతులమీదుగా సన్మానించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్ర రావు మాట్లాడుతూ జరిగిన పంచాయతీ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ గ్రామీణ ప్రాంతాల్లో బిజెపి బలం పెరిగిందని యాదాద్రి జిల్లాలో నాలుగు సర్పంచులు, 20 ఉపసర్పంచులు, వెయ్యి వార్డులు గెలిచామని అన్నారు. అలాగే రాష్ట్రంలో 900 సర్పంచులు, 1200 ఉపసర్పంచులు, 10,000 మంది వార్డు నెంబర్లతో గ్రామాలలో సత్తా చాటామని చెప్పారు. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా నిధులు సమ కూరుస్తూ గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుండాలని కోరారు. గ్రామాల అభివృద్ధి చెందితేనే పట్టణాలు రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని, భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ముందుచూపుతో గ్రామాలకు నిధులు విడుదల చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల అశోక్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దాసరి మలేశం, పొత్తంశెట్టి రవీందర్, పడల శ్రీనివాస్, వట్టిపల్లి శ్రీనివాస్, జిల్లా ఇన్చార్జ్ వర్ధన్ రెడ్డి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## సిపిఐ(ఎం) సర్పంచ్‌లకు సన్మానం




**ప్రజాపక్షం/ రామన్నపేట:** ప్రజలకు సర్పంచ్‌లు నిత్యం అందుబాటులో ఉండి ప్రజారంజక పాలన చేసి గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్‌రెడ్డి అన్నారు. రామన్నపేట మండలంలో సీపీఎం బలపరిచిన మునిపంపుల, దుబ్బాక గ్రామాల సర్పంచ్‌లు బొడ్డుపల్లి వెంకటేశం, గట్టు నరసింహాలను స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన సన్మానించి అభినందించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గీత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాగిరు కిష్టయ్య, సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యుడు బోయని ఆనంద్, మాజీ వైస్ ఎంపీపీ నాగటి ఉపేందర్ ఉన్నారు.



## ఆర్థిక సహాయం అందజేత

**ప్రజాపక్షం/మునుగోడు:** రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన కల్పించాలని ఆత్మత్యాగం చేసుకున్న సాయి ఈశ్వరాచారి కుటుంబ సభ్యులను విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ సభ్యులు జగద్గిరి గుట్టలో ఆయన నివాసంలో కుటుంబ సభ్యులను కలిసి రూ.65వేల విరాళాలను విశ్వకర్మ నాలెడ్జ్ సెంటర్ యువజన విభాగం జాతీయ అధ్యక్షులు కూరెళ్ళ శివరామ్ ఆచార్య కమిటీ సభ్యులతో కలిసి అందజేశారు.ఈ సందర్భంగా కూరెల్ల శివరాం వారు మాట్లాడుతూ రిజర్వేషన్ల పేరుతో కాంగ్రెస్ పార్టీ చేసిన మోసంతో కలత చెంది తన ఆత్మత్యాగంతోనైనా బీసీలు రాజకీయ,విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లను సాధించుకోవాలని,తన ప్రాణాన్ని తృణప్రాయంగా అగ్నికి ఆహుతి చేసిన సాయి ఈశ్వరాచారి త్యాగం వెలకట్టలేనిదని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రవీణ్ చారి,త్రినాష్ చారి,ఈశ్వరా చారి,నాగేంద్ర చారి,నరేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనదని, ఉపాధ్యాయులు ఉత్తమ సమాజ నిర్దేశకులను ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మాడుగుల శ్రీనివాస్ అన్నారు. గురువారం బకల్‌వాడి పాఠశాల విశ్రాంత ఉపాధ్యాయులు, లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు గ్రహీత పీడీ ఎడ్విన్ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజికవేత్త డాక్టర్ రాజు మాట్లాడుతూ సమాజానికి నడక నేర్పి ఉత్తమ సమాజ నిర్మాణానికి బాటలు వేసేది ఉపాధ్యాయ వృత్తి అని అన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థి ఒకరు ఎడ్విన్ సార్ నతకు తల్లిదండ్రుల కన్నా ఎక్కువ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బాబురావు, డాక్టర్ రావిరాల అంజయ్య, కోడిరెక్క మట్టయ్య, ఆమోసు, చినపంగ గోపయ్య, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు తాళ్లపల్లి రవి, జిల్లా అధ్యక్షుడు బొప్పని నగేష్, శ్రీరాములు, శ్రీనివాస కృష్ణ పాల్గొన్నారు.

## 10 కిలోల గంట బహుకరణ



**ప్రజాపక్షం/నార్కట్ పల్లి:** మండల కేంద్రంలోని శ్రీ వారిజాల వేణుగోపాల స్వామి దేవస్థానమునకు ధనుర్మాసా ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో10 కేజీల ఇత్తడి గంటను బిల్లకంటి శ్రీకాంత్ దంపతులు బహుకరించారు. ఈ సందర్భంగా గురువారం ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ దోసపాటి ప్రసాద్ శ్రీకాంత్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు సోమ కొండల్ రెడ్డి,ఐతరాజు రమేష్, బెల్లి దశరథ పాల్గొన్నారు.

## వాలీబాల్ సీనియర్ నేషనల్‌కు భార్గవ్



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న దేవులపల్లి భార్గవ్ వాలీబాల్ క్రీడాకారుడు వచ్చే నెల 4 నుంచి 14వరకు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని వారణాసిలో జరిగే 72 సీనియర్ నేషనల్స్ వాలీబాల్ పోటీలకు ఎన్నికయ్యారు. నేషనల్ క్యాంపు ఈనెల 21 నుంచి జనవరి 1వరకు మేడ్చల్ జిల్లా కిష్టాపూర్ మల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహిస్తారు.

# 'కంగ్రాట్యులేషన్స్ శేఖర్ అన్న'

## పంచాయతీ ఎన్నికల్లో పట్టు నిలుపుకున్న పైళ్ల శేఖర్ రెడ్డిని అభినందించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**ప్రజాపక్షం/భువనగిరి :** పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు కైవసం చేసుకుని భువనగిరి నియోజకవర్గంలో తన పట్టును నిలుపుకున్న బిఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డిని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు కంగ్రాజులేషన్ శేఖర్ అన్న అంటూ అభినందించారు. గురువారం భువనగిరిలోని బిఆర్ఎస్ జిల్లా కార్యలయంలో గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచులకు, ఉప సర్పంచులకు, వార్డు సభ్యులకు నిర్వహించిన సత్కార కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్‌కు జిల్లా పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే పైళ్ళ శేఖర్ రెడ్డి పుష్ప గుచ్ఛం అందించి స్వాగతం పలుకుతున్న క్రమంలో పైళ్ళ శేఖర్ రెడ్డిని పై విధంగా అభినందించారు. ఈ విజయం భువనగిరి నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీకి మరింత పట్టును, భవిష్యత్తులో గెలుపునకు బలమైన పునాదిని వేసినట్లయిందని కేటీఆర్ అన్నారు.

ఫలించిన శేఖర్ రెడ్డి వ్యూహరచన.. 2014 సంవత్సరంలో బీఆర్ఎస్ పార్టీలోకి రాజకీయ అరంగేట్రం చేసిన పైళ్ల శేఖర్ రెడ్డి భువనగిరి నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. గత పదిసంవత్సరాల కాలంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో నియోజకవర్గంలో అత్యధిక స్థానాలను కైవసం చేసుకున్న పైళ్ల, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక స్థానాల్లో గెలిపించుకొని తన సామర్థ్యాన్ని మరోసారి రుజువు చేసుకున్నారు. నాలుగు మండలాల్లోని 126 గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యకర్తలకు, పోటీ చేస్తున్న అభ్యర్థులకు వెన్నుదన్నుగా ఉండి, అధికార పార్టీ నుంచి ఎదురయ్యే ఒత్తిడిలు, సవాళ్లను అధిగమించే విధంగా దశ దిశ నిర్దేశం చేశారు. ఎన్నికల సంగ్రామంలో ఆయన చేసిన ఈ వ్యూహరచన ఫలించి, అత్యధిక స్థానాలు గెలుపొందడానికి దోహదపడింది.

# ఉపాధిహామీ పథకాన్ని రద్దు చేసే కుట్ర

## -పేరు మార్పుతో పథకానికి ఎసరు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి పేరు మార్చడం వెనక ఈ పథకాన్ని రద్దు చేసే కుట్ర దాగి ఉందని వ్యవసాయ కార్మిక సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ లు ఆరోపించారు. గతంలో మహత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని ఇప్పుడు వీక్షిత్ భారత్ రోజ్ ఘర్ అజీవికా గ్రామీణ్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి బిజెపి సరికొత్త కుట్రకు తెర లేపిందని వారు ఆరోపించారు. గురువారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అనేక దశాబ్దాల పాటు పోరాడి గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టాన్ని సాధించుకోవడం జరిగిందని బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకం అమలుకు నానా కొర్రీలుపెడుతూ వచ్చిందని పని దినాలను తగ్గించడంతో పాటు రకరకాల యాప్‌లతో గ్రామీణ ప్రాంత పేదలను ఇబ్బందులు పెట్టిందని వారు తెలిపారు. ఇప్పుడు ఏకంగా పథకాన్ని రద్దు చేసే ఆలోచనతోనే పేరు మార్పు చేశారన్నారు. మారిన పరిస్థితుల్లో పని దినాలను పెంచడంతోపాటు దినసరి వేతనాన్ని గణనీయంగా పెంచాల్సిన సమయంలో గతేడాది కేవలం 50 నుంచి 60 రోజులు మాత్రమే సగటు పని దినాలు నమోదయ్యాయని రోజు వారి వేతనం కూడా గణనీయంగా తగ్గిందని తాటి, కర్ణకుమార్ తెలిపారు. ఈ చట్టంలో కేంద్ర ప్రభుత్వం తన వాటాను తగ్గించి రాష్ట్రాలపై రుద్దడం ద్వారా ఈ పథకానికి తిలోదకాలు ఇచ్చే ప్రయత్నంలో ఉందన్నారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో కూరుకుపోతున్న వేళ పని దినాలను పెంచి గ్రామీణ ప్రాంత ప్రజలను ఆదుకోవాల్సిన ప్రభుత్వం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తుందన్నారు. ప్రస్తుతం వీక్షిత్ భారత్ రోజ్ ఘర్ అజీవిక గ్రామీణ్ పథకం పేరును రద్దు చేసి పాత పేరును కొనసాగించడంతో పాటు పని దినాలను పెంచాలని, దినసరి కూలీ రూ. 600 గిట్టుబాటు అయ్యేవిధంగా చూడాలని లేని పక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో గ్రామ స్థాయి నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తాటి వెంకటేశ్వరరావు, సిద్దినేని కర్ణకుమార్ లు హెచ్చరించారు.

# రాహుల్, సోనియా గాంధీలపై బిజెపిది కక్ష సాధింపు చర్య

## -జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్ర ప్రభుత్వం ఈడిని అడ్డుపెట్టుకుని సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ఆరోపించారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ లపై వేధింపులకు పాల్పడడాన్ని నిరసిస్తూ ఆలిండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు టిపిసిసి ఆదేశానుసారం జిల్లా కాంగ్రెస్ కమిటీ, నగర కాంగ్రెస్ కమిటీల ఆధ్వర్యంలో నూతి సత్యనారాయణ గౌడ్, నాగండ్ల దీపక్ చౌదరి నేతృత్వంలో గురువారం అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ కేసులతో గత కొన్ని సంవత్సరాలుగా ఈడిని అడ్డుపెట్టుకుని సోనియా, రాహుల్ గాంధీలపై వేధింపులకు పాల్పడుతూ బిజెపి రాక్షసనందాన్ని పొందుతుందన్నారు. ఢిల్లీ హైకోర్టు తీర్పు బిజెపికి చెంపపెట్టు వంటిదన్నారు. కాంగ్రెస్ అగ్రనేతలను రాజకీయంగా దెబ్బతీయాలనే దురుద్దేశ్యంతో బిజెపి అక్రమ కేసులు బనాయించిన ఢిల్లీ హైకోర్టు సైతం దీనిని రాజకీయ ప్రేరేపిత కేసులుగా పరిగణించి ఈడి చార్జ్‌షీట్‌ను తిరస్కరించిందన్నారు. దేశం కోసం ప్రాణాలు అర్పించిన కుటుంబం వారిదని అలాంటి నాయకులపై బిజెపి కుట్రకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. దేశ ప్రజలు బిజెపి అరాచకాలను గమనిస్తున్నారని త్వరలోనే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులను ఖమ్మం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించి సొంత పూచీకత్తుపై విడుదల చేశారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పులిపాటి వెంకయ్య, వడ్డెబోయిన నర్సింహారావు, దొబ్బల సౌజన్య, మొక్కా శేఖర్ గౌడ్, బొడ్డు బొందయ్య, కార్పొరేటర్లు, పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# డూప్లికేట్ చీరలను అరికట్టేందుకు కార్పస్ ఫండ్ విడుదల చేయాలి



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** పోచంపల్లి హ్యాండ్లూమ్ పార్క్ అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్‌హెచ్‌డిసి వద్ద డిపాజిట్ చేసిన రూ.28 కోట్ల కార్పస్ ఫండ్‌ను పోచంపల్లి చిటికి పరిశ్రమ అభివృద్ధి డూప్లికేట్ చీరల నివారణ కోసం విడుదల చేయాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో కలిసి జాతీయ చేనేత డెవలప్మెంట్ కమిషనర్ డా.బినాని కోరినట్లు హ్యాండ్ ఆల్ ఇండియా హ్యాండ్లూమ్ బోర్డు మాజీ సభ్యులు తడక యాదగిరి గురువారం తెలిపారు. మధ్యాహ్నం న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో పోచంపల్లి చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. అదేవిధంగా జాతీయ స్థాయిలో చేనేత బడ్జెట్‌ను కనీసం రూ.1000 కోట్లు కేటాయించే విధంగా ఆర్థిక శాఖకు ప్రతిపాదనలు పంపాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు.

# మోటకొండూర్ మండలంలో సర్పంచ్ విజేతలు

**ప్రజాపక్షం/మోటకొండూర్ :** మోటకొండూర్ మండలంలో 20 గ్రామ పంచాయతీలకు గాను ఆబిద్ నగర్ నాయిని అమరావతి బిఆర్ఎస్, గిరబోయిన గూడెం రంగు సిందూజ కర్ణాకర్ స్వతంత్ర అభ్యర్థి, అమ్మనబోలు మామిడాల నర్సమ్మ బిఆర్ఎస్, వర్టూర్ గట్టికోప్పుల శ్రీలత మచ్చేందర్ కాంగ్రెస్, దిలావర్పూర్ గొలను అంజయ్య కాంగ్రెస్, కదిరేణిగూడెం జెట్ట లత బిఆర్ఎస్, చామాపూర్ వాకిటి లింగారెడ్డి కాంగ్రెస్, సికిందర్ నగర్ పసల ప్రదీప్ కాంగ్రెస్, కొండాపురం కొప్పుల వెంకట్ రెడ్డి కాంగ్రెస్ ఏకగ్రీవం, ముత్తిరెడ్డి గూడెం బుడిగే బాలరాజు కాంగ్రెస్, మాటూరు జన్నే సిద్దులు కాంగ్రేస్, చందేపల్లి బోట్ల నగేశ్ కాంగ్రేస్, తేర్యాల మంత్రి లత స్వామి కాంగ్రెస్, మోటకొండూరు భూమండ్ల జెయమ్మ శ్రీనివాస్ కాంగ్రెస్, అరెగూడెం దివ్య మకర జ్యోతి కాంగ్రేస్, చాడ ఆకుల శ్రీనివాస్ కాంగ్రెస్, కాటేపల్లి పచ్చిమట్ల జయమ్మ మదార్ గౌడ్ కాంగ్రెస్, ఇక్కుర్తి కందుల స్వామి కాంగ్రేస్, పెద్ద బావి వేల్పుల రజిత శ్రీరాములు ఏకగ్రీవం బిఆర్ఎస్ గెలుపొందారు.

# సర్పంచ్‌ను సన్మానించిన ఆర్‌టిఐ కమిషనర్



**ప్రజాపక్షం/తుర్కపల్లి :** తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో దత్తాయపల్లి నూతన సర్పంచ్ జేరిపోతుల కరుణాకర్, తన పాలక వర్గంతో మర్యాద పూర్వకంగా కలిసిన సందర్భంగా ఆయన నూతన సర్పంచ్, పాలక వర్గ సభ్యులను అభినందించి శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎరుకల వెంకటేష్ గౌడ్, మల్లేష్ యాదవ్, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

# కలగానే కళాభారతి ఆడిటోరియం నిర్మాణం

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** జిల్లా కేంద్రంలో ఆడిటోరియం నిర్మించాలని గత 35ఏళ్ళుగా ముఖ్యమంత్రి జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు ప్రజా ప్రతినిధులకు అనేక పర్యాయాలు వినతి పత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని నల్లగొండ కళా భారతి సాధన సమితి కన్వీనర్ బక్క పిచ్చయ్య, కోకన్వీనర్ పున్నమి అంజయ్యలు అన్నారు. గురువారం స్థానిక టిఎన్‌జిఓ ఉద్యోగుల సంఘం భవనంలో నల్లగొండ కళా భారతి సాధన సమితి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లా కేంద్రమైన నల్లగొండలో ఇప్పటి వరకు ఆడిటోరియం లేక పోవడం వలన సాహిత్య సాంస్కృతిక కళా రంగాలకు తీరని నష్టం కలుగుతుందన్నారు.కళా భారతి ఆడిటోరియం నిర్మాణం కల గానే మిగిలిపోయిందని ఇప్పటి కైనా జిల్లా మంత్రి కోమటి రెడ్డి వెంకటరెడ్డి చొరవ తీసుకొని ఆడిటోరియం నిర్మాణం వెంటనే చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# నైజీరియాలో పలివెల వాసి మృతి



**ప్రజాపక్షం/మునుగోడు:** నైజీరియా దేశంలో మండలంలోని పలివెల గ్రామవాసి గుండెపోటుతో గురువారం మృతి చెందాడు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం ఇదే గ్రామానికి చెందిన బడుగు రాజు(35) గత రెండు సంవత్సరాలుగా నైజీరియా దేశంలో జియాలజిస్ట్‌గా పని చేసేందుకు వెళ్లి గుండెపోటుతో మృతి చెందినట్లు తెలిపారు. రాజు మృతదేహాన్ని పలివెల గ్రామనికి రప్పించేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నైజీరియా ప్రభుత్వంతో మాట్లాడినట్లు శనివారం గ్రామానికి వస్తున్నట్లు తెలిపారు.మృతునికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

# సర్పంచ్ శ్రీనివాస్‌ను అభినందించిన కెటిఆర్



**ప్రజాపక్షం/ రామన్నపేట:** జిల్లాలో ఇటీవల జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన బీఆర్ఎస్ నూతన సర్పంచ్‌లను, ఉపసర్పంచ్‌లకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని పల్లివాడ నూతన సర్పంచ్ కంభంపాటి శ్రీనివాస్‌ను శాలువాతో సన్మానించి అభినందించారు.

# భద్రాద్రిలో భయపెడుతున్న గ్యాంగ్ వార్స్





**-పెరుగుతున్న హింసా ప్రవృత్తి**
**-మృతుని బంధువుల ఆందోళన**

**ప్రజాపక్షం/ భద్రాచలం :** భద్రాచలం పట్టణంలో గ్యాంగ్ వార్స్ భయపెడుతున్నారు. పట్టపగలే రెండు హత్యలు జరగడంతో ప్రజలు భయకంపితులవుతున్నారు. చిన్న చిన్న ఘర్షణల నేపథ్యంలోనే ప్రాణాలు తీస్తుండటం ఇందులో ఎక్కువ మంది గంజాయి, ఇతర మత్తు పదార్ధాలకు బానిసలైన వారే నిందితులుగా ఉండటం జరుగుతుంది. భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో గల కెకె ఫంక్షన్ హాల్ వద్ద జరిగిన చిన్న ఘటన చివరకు ఓ నిండు ప్రాణాన్ని బలితీసుకున్నది. హత్య జరగడానికి కారణం తెలిస్తే ఆశ్చర్యపోక తప్పదు. రెండు మోటార్ సైకిళ్ల ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు వ్యక్తులు ఎవరిది తప్పనే విషయమై ఘర్షణ పడుతుండగా అందులో ఒకరికి పరిచయం ఉన్న సజ్జా రవివర్మ (38) విడదీసే ప్రయత్నం చేశాడు. సమీపంలో మద్యం దుకాణం ఉండటం మత్తులో ఉన్న యువకులు విచక్షణా రహితంగా రవివర్మపై దాడి చేశారు. ఆసుపత్రికి తరలించినప్పటికీ ఆ ఘటనా స్థలంలోనే ఆయన ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. కొందరు యువకులు ఒకరికొకరు ఫోన్ చేసుకుని ఇటువంటి ఘటనలు జరిగినప్పుడు మూకుమ్మడిగా దాడులకు పాల్పడుతూ భయోత్పాత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. హతుడు రవివర్మ స్థానికుడు కాదు. స్థానిక గ్యాంగులతో ఆయనకు ఎటువంటి పంచాయితీ లేదు. బంధువుల ఇంటికి పరామర్శకు వచ్చి వెళ్తున్న క్రమంలో పాల్వంచకు చెందిన రవివర్మ చిన్న ఘర్షణను నివారించే క్రమంలో ప్రాణాలను కోల్పోయాడు. దాడి చేసేటప్పుడు పాత కక్షలు లేదా ఇతరత్రా వ్యవహారాలను దృష్టిలో ఉంచుకుని దాడులు చేస్తారు. కానీ ఇక్కడ హతునితో పరిచయమే లేదు. అయినా దాడికి పాల్పడటం వెనక మత్తులో ఉండటమేనని సమాచారం. పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లుతున్న భద్రాచలానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి కూడా భక్తులు ఇక్కడకు వస్తుంటారు. అటువంటి ప్రదేశంలో ఇటువంటి గ్యాంగ్ వార్‌లు జరగటం బయట నుంచి వచ్చిన వ్యక్తులను హతమార్చటం ఈ క్షేత్రానికి అప్రతిష్టను తెచ్చిపెడుతుంది. పోలీస్ యంత్రాంగం శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టిసారించాల్సి ఉంది. ముఖ్యంగా గంజాయి వాడకంపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

**హతుని బంధువుల ఆందోళన :**

బుధవారం హత్యకు గురైన రవివర్మ బంధువులు గురువారం గోదావరి బ్రిడ్జి సమీపంలో ఆందోళన నిర్వహించారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా ఈ హత్యలో పాల్గొన్న కొందరు గతంలో పలు కేసుల్లో ఉన్నట్లు సమాచారం.

# కవిత సుడిగాలి పర్యటన



**- పార్టీ ఫిరాయింపు ఎంఎల్‌ఏలపై స్పీకర్ నిర్ణయం దారుణం**
**- ఇది రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం**
**- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రెండురోజుల పర్యటనలో భాగంగా తొలిరోజు గురువారం జిల్లాలోని పలు ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. జనం బాటలో భాగంగా కొత్తగూడెంలోని ప్రధాన రోడ్డుపై జెండాను ఎగురవేసిన అనంతరం స్నేహలత సంధ్యలత అనాధ ఆశ్రమంలో వృద్ధులతో ముచ్చటించారు. , ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించి రోగుల బాగోలు అడిగి తెలుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ ఫిరాయింపు ఎంఎల్‌ఏల విషయంలో స్పీకర్ నిర్ణయం అంత్యంత దారుణం అని అన్నారు. ఒక పార్టీలో గెలిచి మరో పార్టీలోకి మారినట్లు స్పష్టమైన ఆధారాలు ఉన్నప్పటికీ ఆ ఆధారాలను సైతం ప్రక్కకు పెట్టిన స్పీకర్ వ్యవహరించిన తీరు ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా ఉందన్నారు. అధికారం బలంతో ఇష్టాను సారంగా చేస్తున్నారని, ఇది మంచిపద్దతి కాదని, చిత్తశుద్ధితో వ్యవహరించాలని హితవు పలికారు. ముగ్గురు మంత్రులు ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని చెప్పారు. సింగరేణి సంస్థను ప్రైవేటు పరం చేసేందుకు ప్రభుత్వం యోచిస్తోందని, ప్రైవేటీ కరణను విరమించుకోవాలని, లేదంటే యువతకు పెద్ద ఎత్తున అన్యాయం జరిగే ప్రమాదం ఉందన్నారు. ప్రజా సమస్యలపై జాగృతి పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఇస్తామన్న రూ. 2500, రైతుబంధు ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. 18 సం. నిండిన ప్రతీ మహిళకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని అధికారంలో ఉన్న ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, లేదంటే సమస్యలను ఎత్తిపెట్టి చూపుతూ ఉద్యమాలు చేసేందుకు వెనుకాడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో జాగృతి నాయకులు మారేపల్లి మాధవి, వీరన్న, జగదీష్, సాగర్ పాల్గొన్నారు.

# మూడోసారి ముడిపడిన ఉప సర్పంచ్ ఎన్నిక..!



**-చెరువుమాధారంలో పోలీసు పహారా మధ్య ఎన్నిక**
**-ఉప సర్పంచ్‌గా నందిగామ వెంకటరత్నం ఏకగ్రీవం**

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** చెరువుమాదారం పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ఉత్కంఠభరితంగా సాగిన వ్యవహారంలో మూడో సారి ముడిపడింది. నేలకొండపల్లి మండలం లోని చెరువుమాధారం పంచాయతీ సర్పంచ్ గా బీఆర్ఎస్ కు చెందిన అమరగాని యల్లయ్య ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్ ఎన్నిక కు పోటీ తీవ్రం కావటంతో అకస్మిక ఎన్నిక ను గురువారం నిర్వహించారు. పంచాయతీ లో మొత్తం 12 వారులకు గాను కాంగ్రెస్ కు 6 వార్డులు, బీఆర్ఎస్ కూటమి కి 6 వార్డులు వచ్చాయి. సర్పంచ్ ఓటు తో బీఆర్ఎస్ కూటమి కి ఉప సర్పంచ్ పదవికి దక్కునున్నది. కానీ పొత్తులో భాగంగా సీపీఎం కు చెందిన వారికి ఇవ్వాలని ఆపార్టీ పట్టుబట్టటంతో ఎన్నిక రెండు పర్యాయాలు వాయిదా పడింది. గురువారం ప్రత్యేక ఆకస్మికసమావేశం ను నిర్వహించారు. రిటర్నింగ్ అధికారి గా మండల విద్యాశాఖాధికారి గాబాలిన చలపతిరావు ను నియమించారు. ప్రత్యేకాధికారిగా తహశీల్దార్ వి.వెంకటేశ్వర్లు ను ఏర్పాటు చేశారు. పోలీస్ పహారా సమక్షంలో ఎన్నిక ను పంచాయతీ కార్యాలయంలో నిర్వహించారు. ఉదయం 9 నుంచి 11 గంటల వరకు బీఆర్ఎస్‌సీపీఎం మధ్య చర్చలు జరిగాయి. బీఆర్ఎస్ కు చెందిన 8,వ వార్డు కు చెందిన సభ్యుడు నందిగామ వెంకటరత్నం తమకు ఇవ్వాలని పట్టుబట్టారు. కాంగ్రెస్ సభ్యులకు ఓ సభ్యుడు జత కడితే ఉప సర్పంచ్ పదవికొట్టుకపోయే అవకాశం ఉండటంతో చివరకు ఎట్టకేలకు బీఆర్ఎస్ నాయకులు నందిగామ వెంకటరత్నం కు ఇవ్వాలని నిర్ణయించారు. దీంతో బీఆర్ఎస్ సభ్యులు అంతా ఒకేసారసి పంచాయతీ కార్యాలయం కు చేరుకున్నారు. కాంగ్రెస్ కు చెందిన సభ్యులు ఆ తరువాత రావటంతో ఎన్నిక ఏం జరుగుతుందోనని ఇరు పార్టీల మధ్య తీవ్ర ఉత్కంఠత నడిచింది. మొత్తం మీద 8 వ వార్డు కు చెందిన నందిగామ వెంకటరత్నం ను సర్పంచ్ అమరగాని యల్లయ్య ప్రతిపాధించారు. 9వ వార్డు సభ్యుడు కొచ్చెర్ల పుల్లయ్యాయ బలపరిచారు. సింగిల్ నామినేషన్ కావటంతో ఉప సర్పంచ్ గా వెంకటరత్నం ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. ఈ ఎన్నిక వద్ద గ్రామంలో రెండు పార్టీల కు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశంతో ఎన్నిక ప్రశాంతంగా ముగిసింది.

## విద్యుత్ లైన్ ఏర్పాటు చేయండి



**ప్రజాపక్షం/ ఖమ్మం :** మల్లెమడుగు డబుల్ బెడ్‌రూం ఇండ్లకు ప్రత్యేక విద్యుత్ లైన్ ఏర్పాటు చేయడంతో పాటు దారి పొడవునా విద్యుత్ లైట్లు ఏర్పాటు చేయాలని నగర కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. గురువారం సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బోడా వీరన్న నేతృత్వంలో నగర కమిషనర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రత్యేక విద్యుత్ లైన్ లేకపోవడంతో తరచూ విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వీధి దీపాలు లేక ఇబ్బందులుపడుతున్నారని వీరన్న మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వచ్చారు. ఆయన అంచనా వేసి త్వరలో నూతన విద్యుత్ లైన్ ఏర్పాటుతో పాటు వీధి దీపాలను ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ప్రవీణ్, రాజు, ఆదిలక్ష్మి , లలిత, తులసి, స్వర్ణలత, భారతమ్మ తదితరులు ఉన్నారు.

## గంజాయి కేసులో పదేళ్లు జైలు శిక్ష

**ప్రజాపక్షం/ ఖమ్మం క్రైం :** గంజయి విక్రయిస్తూ పోలీసులకు పట్టుబడిన నిందితునికి పది సంవత్సరాలు జైలు శిక్ష, 50 వేల రూపాలయలు జరిమానా విధిస్తూ మొదటి అదనపు జిల్లా, సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కె ఉమాదేవి గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం 2023 అక్టోబర్ 27న ఖమ్మం రూరల్ పోలీసులు ఆటోనగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఒక ఆటోని నిలిపి తనిఖీ చేస్తుండగా అందో ప్రయాణిస్తున్న వ్యక్తి పోలీసులను చూసి దిగి అనుమానాస్పందంగా వెళ్లిపోతుండగా నిలువరించి అతని వద్ద ఉన్న బ్యాంగ్‌ను తనిఖీ చేయగా అందులో పది కిలోల గంజాయి లభ్యమైంది. పోలీసులు అతనిని విచారించగా ఖమ్మం వరంగల్ క్రాస్‌రోడ్డు ప్రాంతానికి చెందిన నరపొంగు కళ్యాణ్‌గా గుర్తించారు. జల్సాలకు అలవాటు పడి అక్రమార్జన కోసం గంజాయి సరఫరా చేస్తున్నట్లు వెల్లడైంది. రూరల్ పోలీసు స్టేషన్‌లో అతనిపై ఎన్‌డిపిఎస్ 1985 చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం కోర్టులో అభియోగపత్రం దాఖాలు చేశారు. పలు వాయిదాల అనంతరం అభియోగం రుజువుకావడంతో గురువారం ఇచ్చిన తుది తీర్పులో నిందితుడికి పది సంవత్సరాలు జైలు శిక్ష, యాబై వేలరూపాయల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ఈ కేసులో ప్రాసిక్యూషన్‌కు సహకరించిన అప్పటి విచారణ అధికారి ఇన్స్‌స్పెక్టర్ రాజిరెడ్డి, అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ జె. శరత్‌కుమార్ రెడ్డి, కోర్టు కానిస్టేబుల్ వెంకయ్య, కోర్టు లైజనింగ్ ఎస్ఐ కె.శ్రీకాంత్, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్‌రావు, హోంగార్డు ఆఫీసర్ ఎండి ఆయూబ్‌ను సిపి సునీల్‌దత్ అభినందించారు.

## సివిల్స్‌లో మండల వాసికి 86వ ర్యాంకు



**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** యుపిఎస్‌సి నిర్వహించిన సివిల్ సర్వీస్ మెయిన్స్ పరీక్షలో మండల పరిధిలోని సుకినితండాకు చెందిన మాలోత్ కార్తీక్ 86వ ర్యాంకు సాధించాడు. అబ్కారీ ఎస్ఐగా పనిచేస్తున్న మాలోత్ బాషా, ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్న పార్వతి దంపతుల కుమారుడు కార్తీక్ ఖమ్మంలోని న్యూవిజన్ పాఠశాలలో పదవ తరగతి, హైదరాబాద్‌లో ఇంటర్ చదివాడు. గౌహతి ఐఐటిలో బిటెక్ పూర్తి చేశాడు. 2020 సంవత్సరంలో చెన్నయ్ కార్పోరేషన్‌లో ఏఈగా ఉద్యోగంలో చేరి డిఈగా పదోన్నతి పొందారు. సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా కార్తీక్ పోటీ పరీక్షలకు హాజరవుతున్న క్రమంలోనే ఇండియన్ ఇంజనీరింగ్ సర్వీస్‌కు ఎంపికయ్యారు. ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఎన్‌పిసిఐఎల్, ఎన్‌టిసి, పిసిసిఎల్ వంటి కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో ఉద్యోగాన్ని పొందాడు. దేశానికి సేవ చేయాలనే లక్ష్యంతో సివిల్ సర్వీస్ పరీక్షకు సిద్ధమయ్యాడు. ఈ ప్రయత్నంలోనే మెయిన్స్‌లో 86వ ర్యాంకు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తీసకు వచ్చాడు. ప్రజలకు మెరుగైన సేవలను అందించడమే తన లక్ష్యమని అందుకే సివిల్ సర్వీసెస్ ఎంచుకున్నట్లు కార్తీక్ తెలిపారు. పట్టుదల, క్రమశిక్షణతో సాధిస్తే ఏదైనా సాధించవచ్చునని సూచించారు. తాను యూట్యూబ్‌లో ఉన్న స్టడీ మెటీరియల్ ద్వారా చదివి ర్యాంకు సాధించినట్లు కార్తీక్ తెలిపారు.

## స్మశానవాటిక స్థలాన్ని పరిశీలించిన అధికారులు





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 14వ డివిజన్ గొల్లగూడెంలో స్మశానవాటిక స్థలాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. గురువారం 14వ డివిజన్ గోపాలపురంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పర్యటించారు. ఈ సందర్భంగా గొల్లగూడెంలో స్మశానవాటిక స్థలం ఆక్రమణకు గురవుతుందని స్థానికులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు దృష్టికి తీసుకు వచ్చారు. వెంటనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్మశానవాటిక స్థలంలో ఆక్రమణలు ఉంటే తొలగించి రక్షణ చర్యలు చేపట్టాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు ఆధ్వర్యంలో సర్వేయర్, ఆర్ఐ, ఇరిగేషన్ అధికారులు స్మశానవాటిక స్థలాన్ని పరిశీలించారు. దశాబ్దాల కాలం నుంచి ఉన్న స్మశానవాటిక స్థలాన్ని కొంత మంది ఆక్రమిస్తున్నారని స్థానికులు అధికారులకు తెలిపారు. గతంలో భూమి విక్రయించిన రైతులు కూడా తమకు కొంత భూమి ఉందని ఇప్పుడు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని స్థానికులు అధికారుల దృష్టికి తీసుకు వచ్చారు. గతంలో భూమి విక్రయించిన సమయంలో ఉన్న హద్దులను కాదని ఓ వెంచర్ యజమాని స్మశానవాటిక స్థలాన్ని ఆక్రమిస్తున్నట్లు స్థానికులు ఆరోపించారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించి స్మశానవాటిక స్థలాన్ని ఆక్రమణ నుంచి కాపాడాలని కోరారు. రెవెన్యూ అధికారులు స్మశానవాటిక స్థలం చుట్టూ పరిసరాను పరిశీలించారు. రికార్డుల ప్రకారం పరిశీలించి ఆక్రమణలకు గురైతే తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని రెవెన్యూ అధికారులు తెలిపినట్లు స్థానికులు తెలిపారు.